క్లుప్తంగా

ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దాం



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేవైఎం నాయకులు

ఆదోని అర్బన్: స్వాతంత్య్ర సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దామని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్‌కుమార్ అన్నారు. గురువారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి వేడుకలను స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ బ్రిటిష్ వారితో చివరిశ్వాస వరకు పోరాడారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నార్త్ అధ్యక్షులు శివ, సెంట్రల్ అధ్యక్షులు నరసింహా, సౌత్ అధ్యక్షులు ఈశ్వర్, సాదాపురం అధ్యక్షులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధరూఢ స్వామి మహారథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సిద్ధరూఢస్వామి

పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులో వెలసిన మహా తపస్వీ సిద్ధరూఢ స్వాముల వారి మహారథోత్సవం శుక్రవారం ఘనంగా జరగనుంది. మహా తపస్వీ సిద్ధరూఢస్వాముల వారు 1758లో కర్ణాటక రాష్ట్రం బీదరుకోట గ్రామంలో జన్మించారు. ఆయన పుట్టిన ఐదేళ్ల నుంచే దేశ సంచారం చేస్తూ ప్రజలకు భక్తి మార్గం చూపుతూ పర్యటించేవారని చెబుతారు. అందులో భాగంగానే పెద్దకడబూరు గ్రామం చేరుకున్న స్వామి గ్రామంలో కొన్ని రోజులు భిక్షాటన కూడా చేసినట్లు గ్రామ పెద్దలు చెబుతారు. స్వాములవారు ఎన్నో దివ్య మహిమలతో ప్రజలను భక్తిమార్గంలో పయనింప చేశారు.

దర్గాలో ఘనంగా అమావాస్య వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలను సమర్పించారు. గురువారం స్వామి వారం కావడంతో పాటు అమావాస్య కలిసి రావడంతో భక్తులు బుధవారం సాయంత్రం నుంచే తరలివచ్చారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



నందవరంలో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

నందవరం : కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్యలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏపీ రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ..పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. పశ్చిమ ప్రాంత రైతులకు తాగునీరు, సాగు నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులుదేవారాజు, దస్తగిరి, పక్కీర్‌సాబ్, ముని, హనుమంతు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేసినందుకు బైండోవర్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో అసత్య ప్రచారం చేసిన మాల రాజు అలియాస్ బాషాను బైండోవర్ చేసినట్లు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసులు గురువారం రాత్రి తెలిపారు. తన పేరు మాల రాజు కాగా పట్టణానికి వచ్చాక బాషాగా మార్చుకొని, ఉన్నది లేనట్లు చెప్పుకుంటూ తిరుగుతున్నాడని చెప్పారు. మరోసారి ఇలాంటి ప్రచారం చేయకుండా ఉండేందుకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

రమణీయం..రామలింగేశ్వరుడి మహారథోత్సవం

- భక్తజన సంద్రం మధ్య రథయాత్ర
- ఆలయ ఈఓ చేతుల మీదుగా ఉత్సవ అంకురార్పణ



భక్తజనం మధ్య రథోత్సవం



రథం ముంగిట యాగం నిర్వహిస్తున్న పురోహితులు



పల్లకీలో ఊరేగింపుగా ఉత్సవమూర్తులు

నందవరం: దక్షిణ కాశీగా వెలుగొందుతున్న గురజాల క్షేత్రంలో రామలింగేశ్వరుడి మహారథోత్సవం ఆద్యంతం అద్వితీయం. గురువారం మంగళ వాయిద్యాలు, డప్పు దరువులు, మంత్రోచ్చారణలతో అశేష జనవాహిని మధ్య ఆదిదంపతులు రథయాత్ర రమణీయంగా సాగింది. ఆలయ ఈఓ రాంప్రసాద్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేడుకలు చేపట్టారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఈవో చేతుల మీదుగా యాగమంటపంలో పూర్ణహుతి గావించి రథోత్సవానికి అంకురార్పణ పలికారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మహారథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముంగిట నుంచి నంది మంటపం వరకు యాత్ర చేపట్టారు. నందీశ్వరుడికి నారీకేళాల సమర్పణ పూజలు గావించి యథాస్థితికి రథాన్ని చేర్చారు. రథయాత్రలో నంది కోళ్ల ప్రదర్శలు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. రథోత్సవం సందర్భంగా డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 4 మంది ఏఎస్ఐలు, 70 మంది పోలీసు సిబ్బంది, 20 మంది మహిళ పోలీసులు, 30 మంది వలంటీర్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమనీయం..ఆదిదంపతుల కల్యాణం

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో జాగరణ అనంతరం వేకువజామున పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం జరిపారు. ఆలయంలో ప్రత్యేక వేదికపై ఆదిదంపతులను పెళ్లిపీటలపై ఆశీనులను చేశారు. పురోహితులు పెళ్లి మంత్రాలతో పెళ్లి తంతు కానిచ్చారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. ఉదయం తుంగా నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కాశి, రామ, ధర్మ, భీమ, పార్థ లింగాలను దర్శించుకున్నారు. వేడుకలో పురోహితులు హంపేష్‌స్వామి, గ్రామ సర్పంచ్ వీరస్వామి, గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, శివారెడ్డి, రాజేశ్వరరెడ్డి, పరమేష్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రౌడూరులో తాతల జాతర



రథం ముందు సాగుతున్న పల్లకీ



గండదీపాలను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో వెలసిన జెట్టప్పతాత, లక్ష్మన్నతాత, శంకరప్ప తాతల జాతర మహోత్సవాన్ని గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా. స్వాముల వారి 68వ జాతర సందర్భంగా భక్తులు 150 గండాదీపాలను ఊరేగింపుగా తీసుకెళ్లి దీపివంటలను నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కొంత మంది భక్తులు పొర్లుడు దండాలను స్వాముల వారికి చెల్లించుకుని భక్తిభావాన్ని చాటుకున్నారు. ముందుగా స్వాముల వారి పల్లకోత్సవాన్ని గ్రామంలో ఊరేగించి ఆలయం వద్దకు మంగళవాయిద్యాలు, బాజా భజంత్రీల మధ్య తీసుకెళ్లారు. అనంతరం స్వాముల వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారి పల్లకీ ముందుకు సాగగా.. జెట్టప్పతాత రథోత్సవం వందలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించారు.

స్వామి వారికి తులాభారం

జెట్టప్పతాత మఠం ధర్మకర్త వీరభద్రతాతకు భక్తులు స్వామి వారి రథోత్సవం అనంతరం తులాభారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పులిగట్టు ఆంజినేయస్వామి ఉత్సవం



పూజలందుకుంటున్న స్వామి

కౌతాళం: ఎరిగేరి గ్రామంలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గ్రామానికి కిలోమీటరు దూరంలో కొండల్లో వెలసిన ఈ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామునుంచే తండోపతండాలుగా తరలివచ్చారు. తెల్లవారు జామున 3గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలను చేపట్టారు. తెల్లవారు జామునుంచే భక్తులు క్యూలో నిలబడి స్వామిని దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. వందలాది మంది భక్తులు తమ తలనీలాలు సమర్పించారు. శుక్రవారం ఉదయం వరకు పూజలు ఉంటాయని, శుక్రవారం సాయంత్రం స్వామి పల్లకీని కొండపై నుంచి బ్యాండు మేళాలు డప్పు వాయిద్యాలు భక్తుల కొలాటల మధ్య కిందకు తీసుకొస్తామని నిర్వాహకులు తెలిపారు. రాత్రంతా పూర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి శనివారం ఉదయం స్వామి పల్లకీని కట్ట వద్దకు చేర్చడంతో ఉత్సవం ముగుస్తుందని చెప్పారు.

కనుల పండవగా రథోత్సవాలు



పూజలందుకుంటున్న చంద్రమౌళేశ్వరస్వామి



దొడ్డిమేకల గ్రామంలో అశేష భక్త జనుల మధ్య సాగుతున్న రథోత్సవం



హెచ్.మురవణిలో రథోత్సవం

పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకల, హెచ్.మురవణి గ్రామాలు గురువారం హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివనామ స్మరణలతో మార్మోగాయి. దొడ్డిమేకల గ్రామంలోని ఈశ్వరాలయంలో వెలసిన చంద్రమౌళేశ్వర స్వామి, హెచ్.మురవణి గ్రామంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి రథోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయ అర్చకులు వీరభద్రయ్యస్వామి, వీరయ్యస్వామి, వీరేష్‌స్వామి, భూషన్నస్వామిలు తెల్లవారిజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దొడ్డిమేకల గ్రామంలోని చంద్రమౌళేశ్వరస్వామికి కళ్యాణోత్సవం చేపట్టారు. గ్రామస్తులు పిండివంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం దొడ్డిమేకలలో గజ్జహళ్లి వెంకటరామిరెడ్డి ఇంటి నుంచి, హెచ్.మురవణి గ్రామంలో జంగం భూశయ్య ఇంటి నుంచి కుంభాలను రథం దగ్గరికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఆశీనులు చేశారు. మంగళవాయిద్యాల నడుమ, మహిళలు కలశాలతో స్వాగతం పలుకుతుండగా రథాలు ముందుకు కదలాయి. గ్రామ బొడ్రాయి వరకు రథోత్సవాలను నిర్వహించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. దొడ్డిమేకల గ్రామంలో చిన్నారుల కోలాటాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న బ్యాంకర్లు

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికిగానూ నిరుద్యోగులకు ప్రభుత్వ సబ్సిడీ రుణాల కోసం రెండో రోజూ గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఇంటర్వ్యూ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఐకేపీ మెప్మా పట్టణ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 19 మంది బ్యాంకు మేనేజర్లు బీసీ కులాలు, కాపు, బలిజ, తెలగ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్యుల ధ్రువపత్రాలను పరిశీలించారు. దాదాపు 2 వేల మందికి పైగానే ఇంటర్వ్యూలకు హాజరైనట్లు శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని 21వ వార్డు నుంచి 42వ వార్డు పరిధిలోని ఆయా కులాలకు చెందిన యువత, నిరుద్యోగులు హాజరయ్యారు. 42 వార్డుల పరిధిలో కేవలం 98 యూనిట్లు మాత్రమే మంజూరు కావడంతో సబ్సిడీ రుణాలు ఎవరికి అందుతాయోనన్న ఆందోళనలో నిరుద్యోగులు ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ సీఐ సైదుల్, సిబ్బంది

ఆదోని రూరల్: నవోదయం 2.0లో భాగంగా గురువారం ఆదోని పట్టణంలోని రణమండల కొండల్లో నాటుసారా స్థావరాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. 345 లీటర్ల ఘాటైన బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. మరో కేసులో 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఆదోనిలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ లాలుస్వామి, బోయ రవిలపై కేసులు నమోదు చేసి జైలుకు తరలించినట్లు చెప్పారు. నాటుసారా, అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలో మార్చి 1వ తేది నుంచి 18వ తేది వరకు ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 177, సెకండియర్ 215 మంది, నారాయణ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 138 మంది , ద్వితీయ సంవత్సరం 225 మంది వరకు విద్యార్థులకు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో పరీక్షల చీఫ్‌గా లక్ష్మీదేవి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా గోవిందు, నారాయణ కళాశాలలో పరీక్షల చీఫ్‌గా దౌలతసాబ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా నూర్ అహ్మద్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల కేంద్రాలలో ఆన్‌లైన్ వెబ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని చెప్పారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. 8.30 గంటలకే పరీక్ష కేంద్రాల్లో ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.. ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు 270, రెండవ సంవత్సరం 226 మంది, మొత్తం 496మంది విద్యార్థులు జూనియర్ కళాశాలలో జరిగే పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

ఇష్టంతో చదివితేనే మంచి మార్కులు



మాట్లాడుతున్న సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ లింగన్న

గోనెగండ్ల : కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే మంచి మార్కులు సాధించగలరని సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ లింగన్న విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన లింగన్న మాట్లాడుతూ మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు రాసే ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు చదివిన ప్రతి అంశాన్ని సాధన చేయాలన్నారు. పరీక్షలకు భయపడకుండా ధైర్యంగా ఉండి, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి

ఎమ్మిగనూరురూరల్: క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని ఇస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇండినీరింగ్ కాలేజీలో వార్షికోత్సవం-25కే25ను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీలో ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్ మీట్‌ను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం, ఫిజికల్ డైరెక్టర్లు, నంద కిషోర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తంగా ఉండాలని డాక్టర్లు ఇందుమైత్రి, అపర్ణ, విజయభారతి, డాక్టర్ హర్ష అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో అంతార్జీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

మధ్యంతర భృతి ప్రకటించండి

ఆదోని సెంట్రల్: పీఆర్సీ అమలు చేయడంలో జాప్యం జరుగుతోంది, కనుక ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ డిమాండ్‌చేశారు. పట్టణంలో ఎంఆర్‌సీ భవనంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు షణ్ముర్తి, షఫీ, నారాయణ, వెంకటేశ్వర్లు, సుంకన్న, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మార్చి 3, 4వ తేదీలలో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కోసిగి మండలానికి 50 యూనిట్ల రూ.94,50,000 రుణాలు కేటాయించారన్నారు. ఇందుకు గానూ మండలంలోని 526 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మార్చి 3న స్టేట్ బ్యాంక్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి, 4న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్‌కు దరఖాస్తు వారికి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ధ్రువ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఏపీఎంఎంఈఏ డైరీ ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏపీఎంఎంఈఏ డైరీని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వరప్రసాద్, ఆర్ఓ అస్లాంబాషా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని ఓశాంతి సర్కిల్, పార్క్ రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అదే విధంగా సోమప్ప సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌లో భోజన పంపిణీని పరిశీలించారు.

2లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలు తెలియజేసి మార్చి నెల 2వ తేదీ లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ రవి గురువారం తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 20 ఎకరాలకు సంబంధించి ఈ-కైవేసీ చేయించామన్నారు. సమీపంలో వున్న రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించి భూముల వివరాలు తెలియజేయాలన్నారు.

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఇంటి గ్రేటెడ్ హాస్టల్ ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కోరారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఆ ప్రాంతంలోనే పందులు స్వైర్య విహారం చేస్తున్నాయని చెప్పారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పర్యటించి డంపింగ్ యార్డును తొలగించాలని ఆదేశించినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం దారుణమన్నారు. అనంతరం పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డికి వినతి పత్రం అందించారు. నాయకులు మురళీ, ప్రసాద్, శ్రీధర్, వీరేంద్ర, శివ, యల్లప్ప, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



శ్రీమఠం ఎదుట ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి వైభవోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు శనివారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రానున్నారు. వేడుకల్లో పాల్గొని రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్తి అవార్డును అందుకోనున్నారు. ఈనేపథ్యంలో గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ హెలిప్యాడ్ మైదానం, శ్రీమఠం ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల ఏర్పాట్లు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి, తహసీల్దార్ రవి, సీఐ రామానుజులు ఉన్నారు.

మోసగాడిని అరెస్టు చేయండి



మాట్లాడుతున్న నరసింహులు

పెద్దకడబూరు : వందలాది మందికి నకిలీ పట్టాలు అంటగట్టి రూ.కోట్లకు పడగలెత్తిన కమ్మరి పరమేష్ (సీపీఎం రైతు సంఘం నాయకుడు)ను తక్షణమే అరెస్టు చేయాలని బాధితుడు నరసింహుడు డిమాండ్ చేశాడు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. వందల మందికి నకిలీ పట్టాలు ఇచ్చి రూ.లక్షలు ఆర్జించిన ఆయనకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం న్యాయదేవత కల్లుకప్పడమేనన్నాడు. ఇంటి నిర్మాణానికి పట్టా ఇప్పిస్తానని నా దగ్గర రూ. 2.8 లక్షలు కాజేసి నాకు, నా కుటుంబ సభ్యుల పేర్లపై నకిలీ పట్టాలు ఇచ్చాడని వాపోయాడు. ఆయనపై ఈ నెల 17న ఎస్పీ గారికి ఫిర్యాదు చేశానని, ఆయన ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పరమేష్‌పై కేసు నమోదు చేశాడన్నాడు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు.

వలసలు నివారించడంలో ప్రభుత్వం విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, ఉపాధి కూలీలు

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాల్లో కూలీలకు పూర్తి స్థాయిలో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి రాజీవ్ ఆరోపించారు. గురువారం ఉపాధి హామీ కూలీలతో కలిసి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు ప్రారంభించి మూడు నెలలు గడిచినా తగిన వేతనం లభించడం లేదన్నారు. కూలీలకు 200ల రోజులు ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600ల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనులకు సంబంధించిన పనిముట్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం వేడుకలు



గంధాన్ని గుర్రంపై ఊరేగిస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించే దివానే మస్తాన్ వలి స్వామి 39వ ఉరుసు గురువారం ప్రారంభమైంది. తొలిరోజు గంధాన్ని స్వామి వారి గుర్రంపై ఉంచి వీధుల్లో ఊరేగించారు. మహిళలుపెద్ద ఎత్తున తరలి వచ్చి నిండు బిందెలతో నీళ్ల పోసి,కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.